నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, శనివారం 19 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

## కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ మహిళా నాయకులు




సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ముథోల్ నియోజకవర్గ నాయకురాలు పడకంటి రమాదేవి, ఉట్నూర్ మాజీ ఎంపీటీసీ రాథోడ్ చారులత

ఉట్నూర్/భైంసా, ఏప్రిల్ 18 : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శుక్రవారం సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్ర నివాసంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీఆర్ఎస్ మహిళా నాయకులు కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు పడకంటి రమాదేవి, ఉట్నూర్ మాజీ ఎంపీటీసీ రాథోడ్ చారులత, తదితరులున్నారు. అనంతరం ఈ నెల 27న వరంగల్ జిల్లాలో ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రాజకీయ రజతోత్సవ సభ నిర్వహణపై మహిళా నాయకురాళ్లతో కేసీఆర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సభకు సన్నాహకంపై నాయకురాళ్లకు ఆయన పలు సూచనలు చేశారు.

# పెరుగుతున్న పెట్టుబడులు..
# పరిమితంగా రుణాలు


● ఖరారైన బ్యాంకర్ల రుణ పరిమితి ● స్వల్పంగా పెరుగుదల.. సాగుకు అప్పులు



ఆదిలాబాద్, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ) : సాగులో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకులు రుణాల మంజూరు, రుణ పరిమితి విషయంలో సరిగా వ్యవహరించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 1.47 లక్షల మంది పట్టా పాసు పుస్తకాలు కలిగిన రైతులు ఉన్నారు. వీరు సాగు కోసం బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటారు. వివిధ బ్యాంకులకు చెందిన 25 బ్రాంచ్‌ల ద్వారా రైతులకు వానకాలం, యాసంగిలో రుణాలు ఇస్తారు. ఏటా వ్యవసాయ సీజన్‌కు ముందు రుణాల పంపిణీలో భాగంగా బ్యాంకర్ల సమితి పంటల వారీగా సాగయ్యే ఖర్చులు, ఇతర పెట్టుబడులను అంచనా వేస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏ ఏ పంటలకు ఎంత రుణం ఇవ్వాలనేది నిర్ణయిస్తుంది. ఇటీవల బ్యాంకర్ల సమితి సమావేశమై రుణ పరిమితి వివరాలను వెల్లడించింది. గతేడాది పోలిస్తే పంటలవారీగా కొన్నింటికీ మాత్రమే స్వల్పంగా పెంచుతున్నట్లు ప్రకటించారు. రుణాల మంజూరు విషయంలో బ్యాంకర్ల నిర్ణయంపై రైతు సంఘాలు, రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### పెరిగిన పంట పెట్టుబడులు

ఆదిలాబాద్ జిల్లాలో ఏటా వానకాలంలో రైతులు 5.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారు. పెట్టుబడి కోసం బ్యాంకు రుణాలు తీసుకోవడంతోపాటు ప్రైవేటు అప్పులు చేస్తారు. ఏటా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల రేట్లు పెరుగుతున్నాయి. దీంతో రైతులపై పెట్టుబడి భారం పెరుగుతుంది. బ్యాంకులు ఇచ్చే రుణాలు సరిపోకపోవడంతో రైతులు ప్రైవేటు అప్పులు చేసి నష్టపోవాల్సి వస్తుంది. బ్యాంకర్ల సమితి వర్షాధార, నీటి ఆధారంగా చేసే పంటలకు వేర్వేరుగా రుణ పరిమితిని నిర్ణయిస్తారు. జిల్లాలో రైతులు ఎక్కువగా పత్తి, సోయా, కంది, జొన్న, శనగ సాగు చేస్తారు. ఈ ఏడాది ఎకరా పత్తి సాగుకు రూ.2 వేలు పెంచారు. సోయా, జొన్న పంటలకు రుణాలను పెంచలేదు. కందులు శనగ, పెసర పంటలకు స్వల్పంగా పెంచారు. బ్యాంకు పెంచిన రుణాలు సాగుకు సరిపోవని రుణ పరిమితిని ఇంకా పెంచాలని రైతులు కోరుతున్నారు.






### పెట్టుబడి బాగా పెరిగింది..



నాకు మూడెకరాల భూమి ఉంది. రామాయి దక్కన్ గ్రామీణ బ్యాంకులో నేను పంట రుణం తీసుకుంటా. పెట్టుబడులు ఏటా పెరుగుతున్న బ్యాంకు రుణాలు మాత్రం పెరగడం లేదు. ఈ సారి పత్తి ప్యాకెట్ ధర రూ.47 పెరిగింది. ఎరువులు, మందుల ధరలు పెరిగాయి. పత్తి ఏరడానికి కూలీలు కిలోకు రూ.10 తీసుకుంటున్నారు. వేరే ఖర్చులు కూడా ఉంటాయి. బ్యాంకులు ఇచ్చే రుణాలు సరిపోవడం లేదు. దీంతో ప్రైవేట్ అప్పులు తీసుకుని ఎక్కువ వడ్డీతో రైతులు నష్టపోతున్నాం. బ్యాంకర్లు రుణ పరిమితి పెంచాలి.

**- చుక్కబొట్ల రవి, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం**

### ధరలకు అనుకూలంగా రుణాలు ఇవ్వాలి..



ఏటా సాగు పెట్టుబడులు పెరుగుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాల ధరలు బాగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం సబ్సిడీలను ఇవ్వడం లేదు. దీంతో రైతులపై భారం పడుతుంది. ఎరువులు, పురుగుల మందులు, కలుపుతీత కూలీలు, పంట తీసే కూలీల రేట్లు పెరిగాయి. బ్యాంకర్లు వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని రుణపరిమితి నిర్ణయించాలి. కొన్ని పంటలకు గతేడాదితో పోలిస్తే ఎలాంటి మార్పు లేదు. బ్యాంకర్ల నిర్ణయాలు రైతులకు అనుకూలంగా ఉండాలి.

**- బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు**

ఎదులాపురం : నాయకులతో కలిసి వాల్ పెయింటింగ్ వేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న




## రజతోత్సవ సభను జయప్రదం చేయండి

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న**



భైంసాలో వాల్ పెయింటింగ్ ద్వారా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు విలాస్ గాదేవార్

ఎదులాపురం , ఏప్రిల్ 18: బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శాంతి నగర్‌లో జోగు రామన్న స్వయంగా పెయింటింగ్ వేసి సభ విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని ఉద్యమ నాయకుడు కేసీఆర్ సాధించారని తెలిపారు. సమైక్య రాష్ట్ర పాలనలో తెలంగాణకు నిధుల కేటాయింపు, అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యం దక్కేది కాదన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైన తర్వాత విద్యా, ఉద్యోగం వైద్యం, పారిశ్రామిక, వ్యవసాయం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉండేలా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్యూహాత్మకంగా, ముందుచూపుతో కృషి చేశారని గుర్తు చేశారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, లాంటి మహోన్నతమైన పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, ప్రతిష్టను దెబ్బ తీసే ప్రయత్నంలో కాంగ్రెస్ మోసపూరిత పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ పట్టణ అధ్యక్షుడు దాసరి రమేశ్, నాయకులు ఇజ్జగిరి నారాయణ, అలాల అజయ్, పండ్ల శ్రీనివాస్, గంద్రత్ రమేశ్, సంతోష్, నర్సా గౌడ్, ఉగ్గే విఠల్, కుమ్ర రాజు, అశోక్, వినోద్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు,

### సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

భైంసా, ఏప్రిల్, 18 : ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ముథోల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ అన్నారు. శుక్రవారం భైంసా పట్టణంలో వాల్ పెయింటింగ్ వేసి ప్రచారం చేశారు. తెలంగాణకు మళ్లీ మంచి రోజులు రావాలంటే కేసీఆర్ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్, సురేశ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## జొన్న రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**


తాంసి, ఏప్రిల్ 18 : ఎకరానికి 15 క్వింటాళ్ల చొప్పున జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడుతానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తాంసి మండల కేంద్రంలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొన్న రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజలను మోసం చేసి గద్దెనెక్కి హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సురకుంటి మంజుల శ్రీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, సీఈవో కేశవ్, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, నాయకులు మహేందర్, రజినీకాంత్ రెడ్డి, లక్ష్మీపతి, వినోద్ రెడ్డి, సంతోష్, గడుగు గంగన్న, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## భూభారతి అవగాహన సదస్సులో ప్రొటోకాల్ రగడ

**ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వేదిక దిగాలని బీజేపీ నాయకుల ఆందోళన**



అవగాహన సదస్సులో వాగ్వాదానికి దిగుతున్న కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 18 ( నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంపై ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సు రసాబాసగా మారింది. జైనథ్ మండలం పూసాయి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరయ్యారు. ఎంపీ జీ నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులతో పాటు ఆదిలాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి వేదికపైకి వచ్చారు. సదస్సులో అధికారులు ప్రొటోకాల్ పాటించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డిని వేదికపై ఎలా కూర్చోబెడుతారని వెంటనే కిందికి దించాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు ఇరు పార్టీల వారిని బయటకు పంపించగా..చివరికి కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి వేదికపై నుంచి కిందికి వచ్చి కూర్చున్నారు.

## రేపు బీసీ గురుకులాల బ్యాక్‌లాగ్ సెట్

ఎదులాపురం, ఏప్రిల్ 18 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి ఎంజేపీ బ్యాక్ లాగ్ సెట్ ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీన ఉమ్మడి జిల్లాలోని 12 కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల మధ్య నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో రెండు కేంద్రాలు, నిర్మల్ జిల్లాలో నాలుగు కేంద్రాలు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మూడు కేంద్రాలు, మంచిర్యాల జిల్లాలో మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 3,308 విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని ఆయా పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందే చేరుకోవాలని పరీక్ష ప్రారంభమైన తర్వాత ఎవరినీ పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని సూచించారు.



బాదిగూడలో ఎగిరిపోయిన ఇంటి పై కప్పు

## గాలివాన బీభత్సం

ఇచ్చోడ, ఏప్రిల్ 18 : మండలంలోని బాదిగూడ సోంపెల్లి, కోసుగూడ, తలమద్రి తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో బాదిగూడా గ్రామంలో సిడాం గంగారం ఇంటిపై కప్పు రేకులు ఎగిరిపోయాయి. వర్షం పడడంతో ఇంట్లోని నిత్యావసర సరుకులు, వస్తువులు తడిచాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

## చెరువులో నీరులేక..చేపలు మృత్యువాత

● రూ. 50 వేలు నష్టపోయామని మత్స్యకారుల నిరసన ● ఎస్సారెస్పీ కాలువ నీటిని వదిలి మిగిలిన చేపలను కాపాడాలని వినతి

పెంబి, ఏప్రిల్ 18: నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని మందపల్లి గ్రామంలోని కొత్త చెరువులో నీరు అడుగంటిపోవడంతో రూ.50 వేల విలువైన చేపలు చనిపోవడంతో శుక్రవారం మత్స్యకారులు నిరసన తెలిపారు. మందపల్లి గ్రామంలోని కొత్త చెరువులో చేపల పెంపకంతో మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. సాగునీరు అందించేందుకు ప్రతి యేటా ఎస్సారెస్పీ డీ-28 కాలువ ద్వారా ఈ చెరువుకు నీటిని విడుదల చేస్తున్నారు.. గత కొన్ని రోజుల నుంచి విడుదల చేయపోవడంతో చెరువు నీరు అడుగంటిపోయింది. ఉన్న కొద్ది నీటిని కూడా పంటలు ఎండిపోకుండా ఆయకట్టు రైతులు చెరువులో మోటార్లు బిగించి వాడుకున్నారు. ప్రస్తుతం చెరువు పూర్తిగా ఎండిపోవడంతో చేపలు పెద్ద సంఖ్యలో చనిపోయాయి. దీంతో చనిపోయిన చేపలను చూపిస్తూ మత్స్యకారులు నిరసన తెలిపారు. సుమారు రూ.50 వేలు నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మిగిలిన చేపలను చనిపోకుండా వెంటనే చెరువుకు నీటిని విడుదల చేయాలని, చెరువులో మోటర్లు బిగించకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు దేశవేణి రాజన్న, కల్లెడ పెద్దులు, భీమన్న, పోశెట్టి, రమేశ్ తదితరులు కోరారు.



చెరువులో నీరు లేక చనిపోయిన చేపలను చూపిస్తూ నిరసన తెలుపుతున్న మత్స్యకారులు